




కాకాణి కేసు సోమవారానికి వాయిదా



మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్, విచారణ మళ్లీ వాయిదా పడింది. శుక్రవారం రాష్ట్ర హైకోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్ పై ఆయన తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ ప్లీడర్ రాకపోవడంతో న్యాయమూర్తి ఈకేసును సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది. ఈపరిణామాలతో కాకాణి అందుబాటులోకి రాలేదు. దాదాపు పది రోజుల నుంచి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు బెయిల్ పిటిషన్‌పై ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న కాకాణికి హైకోర్టులో చుక్కెదురవుతుంది. ఇప్పటికే మూడుసార్లు న్యాయమూర్తి విచారణ వాయిదా వేశారు. సోమవారం అయినా కాకాణికి బెయిల్ వస్తుందా అనే ఉత్కంఠ నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఉద్రిక్తంగా మారింది. టిడిపి ప్రభుత్వం కావాలనే కక్ష సాధింపు చర్య చేస్తుందని వైసిపి నాయకులు మీడియా ముందుకొస్తున్నారు. సోమవారంతో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మిక వర్గ హక్కుల కోసం మే 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు టివిపి ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం తోటపల్లిగూడూరు మండలం, నరుకూరులో సిఐటియు మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టివిపి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు దాసోహం చేస్తూ, కార్మిక వర్గ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. అంతేకాకుండా బీజేపీ ప్రభుత్వ కార్మిక చట్టాలను కూడా రద్దు చేసి, వాటి స్థానంలో నూతనంగా తీసుకుని వస్తున్న లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని తెలిపారు. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉపాధి హామీ పథకంలో పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ రవాణా రంగ కార్మికుల మెడకు గుదిబండగా మారుతున్న మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న సెన్సార్ ట్రాకింగ్ సిస్టమును రద్దు చేయాలని, ప్రైవేట్ ఏజెన్సీలకు ఎఫ్ సి లను అప్పగించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో రవాణా రంగ కార్మికులు ఐక్యమై ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఈపూరు లక్ష్మయ్య, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.కె మస్తానమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ మధుసూదనమ్మ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల అధ్యక్షులు తమ్మిరెడ్డి రేవతి, గూడ్స్ షెడ్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వేగూరు శంకరయ్య, పశురామయ్య, నాసిన గోపి, ఆకుల సుధాకర్, మొండెం మస్తానయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాసిన పరశురామయ్య, ఏ గోపి, ట్రెజరర్ శివ, ఇందుకూరుపేట ఆటో యూనియన్ అధ్యక్షులు దయాసాగర్, ఇందుకూరుపేట సిఐటియు నాయకులు మైపాటి కోటేశ్వరరావు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆటో కార్మికులు గూడ్స్ షెడ్ ముఠా యూనియన్ కార్మికులు, భవననిర్మాణ కార్మికులు, స్కూల్ స్వీపర్సు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-నెల్లూరు: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఐ.ఎ.ఎస్., వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం నుంచి కమిషనర్ సూర్య తేజ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో టిడ్కో గృహాల నిర్మాణం, నూతన లబ్దిదారులకు ఇళ్ల కేటాయింపు, అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వేసవి కాలం దృష్ట్యా ప్రజలందరికీ తాగునీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, ఆస్తి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణాల అనుమతులు, తదితర అంశాలపై నగర పాలక సంస్థ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంకర్స్‌కు అభినందన



ప్రజాశక్తి-కందుకూరు: వివిఐఎన్ మెమోరియల్ (గ్రాండ్ ఒలింపియాడ్ టెస్ట్)లో కందుకూరు నాగార్జున ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బి. సుదీక్ష రాష్ట్ర మొదటి ర్యాంకు, ఎన్. అక్షయ రెండవ ర్యాంకు సాధించడంపట్ల స్కూల్ డైరెక్టర్ వి. షాలిని రెడ్డి అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, బోధించిన ఉపాధ్యాయులను అభినందనలతో పాటు ధన్యవాదాలు తెలియజేశారు. స్కూల్ ప్రదానోపాధ్యాయులు డి.బాలసుబ్రహ్మం, వి.మల్లెరెడ్డి మాట్లాడుతూ ఐఐటి ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించడంపట్ల ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ప్రమాణాలు అందుకోవడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులకు, కష్టపడి బోధించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తోపాటు, ఐఐటి బోధన సిబ్బంది వై. వెంకటేశ్వర్లు, ఏ.కొండలరావు, పి శ్రీనివాసరావు, సి హెచ్ వి రమేష్, కరణం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ స్కీం ఓ స్కామ్:మంత్రి కొలుసు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోలు వ్యవహారంలో వైసిపి ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు అడ్డగోలుగా వ్యవహరించారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. మండలంలోని వరిగొండ గ్రామంలో శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి గత వైసిపి ప్రభుత్వంలో నిర్మించిన గృహ నిర్మాణాలను ప రిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి వైసిపి నాయకులపై మాటల విమర్శలు సంధించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో హౌసింగ్ స్కీం వెనుక పెద్ద స్కామ్ జరిగిందన్నారు. జగనన్న ఇళ్ల కాలనీ ల్లో వేల కోట్లు దోచిడీ జరిగిందని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణంలోనూ వైసిపి నేతలు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భారీ అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు కుమ్మేశారని ధ్వజమెత్తారు. పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 25,360 ఎకరాల భూములు కొనుగోలు చేసిందని, ఇందుకోసం రూ.55 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వమే చెబుతోందని తెలిపారు. వైసిపి ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి వాటిని తిరిగి నాలుగైదు రెట్లు ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశారని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులను కూడా బెదిరించి వారి భూములను తక్కువ ధరకు కొట్టేశారన్నారు. అంతేకాకుండా భూములను మెరక చేసి (లెవెలింగ్) జగ నన్న కాలనీలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 33 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పి ఇందులోనూ సగా నికిపైగా సొమ్మును వైసిపి నేతలు జేబులో వేసుకున్నారని తెలిపారు. మట్టి తరలింపు పేరుతో వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఇళ్లు లేని పేద లందరికీ స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 2 నుంచి 5 లక్షల విలువైన ఇంటిని ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పార్థ సారథి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి అసంపూర్తి పనులను పరిశీలించారు. గృహ నిర్మాణాలలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలను సోమిరెడ్డి వివరించారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీ సుకొని, వారి నుంచి రికవరీ చేయాలని కోరారు. అన్ని విషయాలపైనా సమగ్ర దర్యాప్తు ద్వారా రికవరీ జరిపి గృహ నిర్మాణాలు పటిష్టంగా నిర్మించేందుకు చర్యలు తీసు కుంటామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కోడూరు శ్రీనివాసులు రెడ్డి (చినబా బి రెడ్డి), టీడీపీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి, బొమ్మి సురేంద్ర,ఉన్నతాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోర్టు నిర్మాణం కోసం తీసుకున్న

భూములకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్

పోర్టు నిర్మాణం కోసం దళితుల వద్ద నుంచి తీసుకున్న భూములను నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు, రోడ్డు నిర్మాణం కోసం, చేవూరు దళితులు 28మంది దగ్గర సర్వే నెంబర్ 553లో, 13.50సెంట్లు భూమి తీసుకున్నారు. నష్ట పరిహారం చెల్లించ లేదని, వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకులు కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో, చే వూరు గ్రామ విలేజ్ రెవెన్యూ అధికారి ప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 2013 చట్టం ప్రకారం, ముందు నష్టపరిహారం చెల్లించి, ఆ తర్వాత పనులు ప్రారంభించాలన్నారు. దీనికి భిన్నంగా, కోర్టు పరిధిలో, శర వేగంగా కోర్టు నిర్మాణ పనులు చేపట్టారు. పరిహారం చెల్లించే దాంట్లో, నిర్వాసితులకు మొండి చేయి చూపిస్తున్నా రన్నారు. చేవూరు దళితుల భూములకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెరువు పోరంబోకు అనే పేరుతో నష్టపరిహారం ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. 50 సంవత్సరాల నుంచి చెరువు పోరంబోకు భూమిని సాగుచేసుకొని దళితులు జీవిస్తున్నారన్నారు. చెరువు పోరంబోకు రికార్డులలో ఉన్నప్పటికీ, సాగుకు అనుకూలమైన భూమిని నమ్ముకొని దళితులు బతుకుతున్నారు. భూమిని కోల్పోయి నిరాశ్రయులైన దళితులకు, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి, దళితులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాధికారులను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో, సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, చేవూరు రాజగోపాల్, చేవూరు ఇస్సాకు, లేళ్ల పల్లి అంకయ్య,లేళ్ల పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

ప్రజా శక్తి-గుడ్లూరు రూరల్/ గుడ్లూరు: మండలంలోని నందలి రైతు సోదరులు అందరికి వాతావరణ శాఖ వారి సమాచారను సారం రాగల రెండు రోజులలో వర్షాలు పడే పరిస్థితులు ఉన్నాయని ఎఒ రవికుమార్ చెప్పారు. మరిముఖ్యంగా వరి పంట కోసినవారు, కోయదలచిన రైతులకు తగు సూచనలు, సలహాలు పంట కోసినవారు

ధాన్యాన్ని కళ్లాలలో ఉంచకుండా వీలైనంత త్వరగా ఇళ్లకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి. పంట కోయదలచిన రైతులు కోతలను వాతావరణ పరిస్థితులు అనుకూలిం చేంత వరకు వాయిదా వేసుకోవాలి.

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ మారిందా?

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ మారిందని శుక్రవారం పెద్ద ఎత్తున చర్చ ప్రారంభమైంది. ఇటీవల కందుకూరు వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్‌సి మహిళకు రిజర్వ్ చేసినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి.



దాంతో ఎస్‌సి వర్గాలలోని వారు పదవి కోసం కొందరు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుని కూడా ఎస్‌సి నాయకులు కలిసి పదవి తమకివ్వాలని కోరారు.గత వైసిపి అధికారంలో ఉండగా ఎస్సీ మహిళకు కందుకూరు వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వ్ అయింది. ఎస్సీ మహిళకు ఆ పదవిని అప్పట్లో ఎవరికి కేటాయించలేదు. అదే రిజర్వేషన్ ప్రస్తుతం కొనసాగుతుందని దీనిని మార్చే అవకాశం ఉందని కొందరు అధికార పార్టీ వర్గీయులు చెబుతూ వచ్చారు. ఓసి జనరల్ అయితే ఆ పదవి తమకి కావాలంటూ ప్రయత్నాలు చేసే వారి సంఖ్య కూడా ఎక్కువగానే కనిపించింది. ఈ నేపథ్యంలో కందుకూరు ప్రాంతంలో కందుకూరు వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసి అయినట్లు ప్రచారం ప్రారంభించారు. ఇది వాస్తవమా కాదా అనే విషయం మాత్రం స్పష్టంగా తెలియడం లేదు. ఓసి వర్గాలలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న కొందరు వ్యక్తులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ మారిందా అని అడిగితే తమకు స్పష్టంగా తెలియదు. చెప్పుకుంటుంటే తాము కూడా ఉన్నామన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న ఓ ముఖ్యమైన వ్యక్తిని ప్రజాశక్తి.. చైర్మన్ రిజర్వేషన్ ఓసి అయిందా అని అడిగితే మారినట్లు ఉంది. స్పష్టంగా అయితే తనకు తెలియదని చెప్పారు. ఏదేమైనప్పటికీ రిజర్వేషన్ మార్పు జరిగిందనే చర్చ కందుకూరులో పెద్ద ఎత్తున శుక్రవారం సాగింది. వాస్తవం ఏమిటో తెలియాల్సి ఉంది.



మాట్లాడుతున్న డిఎంఅండ్ హెచ్ఒ

సుఖప్రసవం చేయాలి:డిఎంఅండ్‌హెచ్ఒ

ప్రజాశక్తి-నెల్లూరు

:ఆరోగ్య పర్యవేక్షకులు ప్రతి గర్భిణిని గుర్తించి వారి పూర్తి సమాచారాన్ని నమోదు చేసుకొని విధిగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని, ఎటువంటి ఆటకం లేకుండా ప్రభుత్వ వైద్యశాలలో సుఖప్రసవం జరిగే వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో జనవరిలో సంభవించిన ఒక మాతృమరణం, ఆరు శిశు మరణాలపై మాతా శిశు మరణాల సబ్‌కమిటీ సమీక్ష సమావేశంలో సుదీర్ఘమైన చర్చ నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి అధ్యక్షత వహించింది.ఈ సందర్భంగా వైద్యాధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఆరోగ్య పర్యవేక్షకులు గర్భిణులకు కాన్పు అయిన సమయం నుంచి పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం, జీరో డోస్ వ్యాక్సినేషన్‌ను 24 గంటల్లోగా చేయించడం, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా ఇప్పించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవంఈ నెల 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మాతా శిశు శ్రేయస్సుకు ప్రాధాన్యత కల్పించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ప్రదర్శనలు, ర్యాలీలు చేపట్టాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవానికి సంబంధించి ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు.. ఆశాజనకమైన భవిష్యత్తు' అన్న నినాదాన్ని విడుదల చేసిందన్నారు. ఈ కమిటీ సమావేశంలో జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి డాక్టరు శేషారత్నం, గైనిక్ హెచ్‌ఒడి డాక్టరు గీతలక్ష్మి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టరు బెన్‌హర్, డిఎల్ఏటిఒ డాక్టరు షేక్ ఖాదర్‌వలి, డిఐఒ డాక్టర్లు ఏ.ఉమామహేశ్వరి, శోభారాణి, విజయలక్ష్మి, స్వప్న, పిఒ (ఎఫ్‌పిసి) పి.ఎల్ దయాకర్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ పి.బ్రిజిత, డిపిఎంఒ ఎం.రమేష్, డెమో కనకరత్నం, డిపిహెచ్ఎన్ఓ జి.మంజుల, ఎఎస్ఒ ఒ.రమేష్, పలువురు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్: గుడ్లూరు మండలంలోని పరకంటపాడు గ్రామంలో సుమారుగా గత 70 సంవత్సరాలుగా దళితులు శ్మశానంగా వాడుతున్న స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆ భూమి మాది అంటూ వచ్చారు. దీంతో సిపిఎం ప్రజాపోరు లో భాగంగా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణిశ్రీ పూజ కు వినతి పత్రం అందజేశారు. ఆ వినతి పత్రానికి స్పందించి పరకంతపాడు గ్రామానికి రెండు రోజుల క్రితం స్వయంగా శ్మశాన స్థలం వద్దకు సబ్ కలెక్టర్ వెళ్లారు.గుడ్లూరు మండలం తహశీల్దార్ జి స్వర్ణ కు ఈ స్థలానికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఎవరైతే ఇబ్బందులు పెడుతున్నారో వారికి నోటీసులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం గుడ్లూరు తహశీల్దార్ జి.స్వర్ణ రికార్డులు పరిశీలించారు. ఆ భూమి గతంలో ప్రభుత్వ భూమి అని 2022లో తన పలుకుబడిని ఉపయోగించి పట్టాను సృష్టించారని తెలుస్తుంది. ఆ స్థలంపై సర్వే చేయాలని సర్వేయర్‌కు, విఆర్ఒలకు ఆదేశాలిచ్చారని గ్రామ సర్పంచ్ కోలా కొండయ్య తెలిపారు. సమస్యలపై తక్షణమే పరిష్కారం చూపుతున్న సబ్ కలెక్టర్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

జయభారత్ ఆస్పత్రికి రూ.2 లక్షలు విరాళం

ప్రజాశక్తి-నెల్లూరు: జయభారత్ హాస్పిటల్ లో బెజవాడ రామచంద్ర రెడ్డి కంటి విభాగం ద్వారా పేదలకు చేస్తున్న ఉచిత కంటి ఆపరేషన్స్ చేస్తున్న "నేత్ర రక్ష సేవా పథకం "కు బెజవాడ రామచంద్ర రెడ్డి మనమడు సునీల్ కన్స్ట్రక్షన్ అధినేత బెజవాడ సునీల్ చంద్రారెడ్డి, ఆయన సతీమణి ఉమ సింహపురి వైద్య సేవా సమితి చైర్మన్ ద్వారా రెండు లక్షల రూపాయలను చెక్ ను కోశాధికారి గుర్రం సుధాకర్ కు అందచేశారు. సీతారామి రెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా వీరు తండ్రి బెజవాడ కృష్ణారెడ్డి కంటి ఆపరేషన్స్ వైద్య పరికరాలకు విరాళం అందచేశారని గుర్తు చేశారు. వీరు అందచేసిన విరాళం తో 100మంది పేద వారికి ఉచితంగా ఆపరేషన్స్ చేస్తామని తెలిపారు. దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమం లో జనరల్ మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశా ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సరస్వతి పూజ ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండ ల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థులకు వి ద్యా ప్రమాణాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమని ప్రశంసించారు. గ్రామ సర్పంచ్ చెరుకూరు సరళ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు చక్కని విద్యా బోధన అందిస్తున్న ఉపాధ్యా యులను అభినందించారు. పాఠశా ల ప్రధానోపాధ్యాయులు షేక్. అహ్మ ద్ బాషా మాట్లాడుతూ పాఠశాల అ భివృద్ధికి సహకరిస్తున్న గ్రామ పెద్దల కు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో పం చాయతీ సెక్రటరీ సి. హెచ్. విజయ దుర్గ, ఎస్ఎంసి చైర్మన్ ఆర్.సువార్త, పాఠశాల ఉపాధ్యాయులు కె. వసంత లక్ష్మి, కె. హెప్సీ, విద్యుల్లత, బి.కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

ప్రజాశక్తి-కందుకూరు: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. పట్టణంలోని అమలనాధుని వారిపాలెం ప్రాథమిక పాఠశాలను సబ్ కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు చదువు ఎలా సాగుతుందో పరిశీలించారు.



ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని, ఉన్నత చదువులు చదివి సమాజ హితానికి దోహదపడాలని విద్యార్థులకు ఆమె ఉద్బోధించారు. ఈ సందర్భంగా సదరు పాఠశాలలో వివిధ తరగతులు చదువుతున్న 20 మంది విద్యార్థులకు ఆధార్ లేదని ఆమె గుర్తించారు. దానికి సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ అనూషకు సూచనలు చేశారు. పిల్లలకు పుట్టిన తేదీ ధ్రువపత్రాల సమస్యకు ప్రత్యామ్నాయం చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆమె ఆదేశించారు. పాఠశాల తరగతి గదులను విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట కందుకూరు మండల విద్యాశాఖ అధికారి కె. సుబ్బారెడ్డి, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులున్నారు.



నివాళి అర్పిస్తున్న దృశ్యం

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు :డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్134వ జయంతి సందర్భంగా కందుకూరు పట్టణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఈనెల 1నుంచి 13వ తేది వరకు జరుగుతున్న నివాళులు అర్పించు కార్యక్రమం .ఏ ఏ డి అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ,దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలనుండి జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో శుక్రవారం బృందావనం యూత్ నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బృందా వనం యూత్ నాయకులు రాహులు, సిహెచ్ దీపక్, డి నాగవర్ధన్ డి రింకు . జే ప్రణయ్, పి మధు డి మణి, మనుసాయి, నవీన్, రూపేష్, జీవన్, పి.గిరి, పి శ్రీమత్ , తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు బార్ అధ్యక్షుడిగా 'వలేటి'

ప్రజాశక్తి-కందుకూరు: బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి.ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది తలపనేని గోపాల కృష్ణమూర్తి వ్యవహరించారు. నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలేటి శ్రీధర నాయుడు, వైస్ ప్రెసిడెంట్ గా సింగరాజు పవన్ కుమార్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సిహెచ్ రవీంద్రనాథ్ ,లైబ్రరియన్‌గా సిహెచ్ సింహాద్రి ,జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా షేక్ యాసిన్ బాషా ఎన్నికయ్యారు.ఎన్నిక కాబడిన అభ్యర్థులకు సీనియర్ న్యాయవాదులైన కెవి లక్ష్మీనారాయణ, బెజవాడ షణ్ణయ్య ,సన్నెబోయిన శ్రీనివాసులు, బీవీ మురళీకష్ణ, సిహెచ్ హరికష్ణ, ఎం ప్రసాద్ రెడ్డి , బి భాస్కరరావు, టి తిరుమలరావు, కె హరి కోటేశ్వరరావు, కె రాజశేఖర్ రెడ్డి,బి రోశయ్య,పి సంపత్ కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



యాప్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లూరు: శ్రీ శిశు సంక్షేమ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన యాప్ వినియోగంపై అంగన్వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్ నాగలక్ష్మీ శుక్రవారం అవగాహన కల్పించారు. గుడ్లూరులోని శారద అంగన్వాడీ కేంద్రంలో యాప్ వినియోగంపై సదస్సు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలోని మూడు సంవత్సరాలలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించే విషయంలో నమోదు ప్రక్రియ గురించి నూతన యాప్ వినియోగం పై సూచనలు, సలహాలిచ్చారు గుడ్లూరు ఒకటి సెక్టార్‌కు సంబంధించిన 20 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మరియమ్మ, ఇస్రమ్మ, శారద, లలితమ్మ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని నరుకూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మంచినీటి చలి వేంద్ర ఏర్పాటు చేశారు. ఎరువులు, పురుగు మందుల డీలర్ల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శిరీష రాణి తెలిపారు. చలివేంద్రాన్ని వ్య వసాయసహాయ సంచాలకులు ఏ.రాజ్ కుమార్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు ఎలా మద్దతిచ్చావ్..?

ప్రజాశక్తి-కందుకూరు

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలికిన టిడిపి అధినేత చంద్రబాబు చరిత్రలో ముస్లిం ద్రోహిగా నిలిచిపోతారని వక్ఫ్ బోర్డు మాజీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ సందాని బాషా శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. లోక్ సభ లో వక్ఫ్ బిల్లు ఆమోదంపై ఆయన నిరసన తెలిపారు. తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయం లౌకిక వాదానికి తూట్లు పొడిచే విధంగా ఉందన్నారు.వక్ఫ్ బోర్డులో ఇతరులకు అవకాశం ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా చంద్ర బాబు ముస్లిం ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. టిడిపిలోని మైనార్టీలు పునరాలోచించు కోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే వారిని ముస్లిములు వెలివేస్తారని హెచ్చరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద ముస్లిముల కోసం రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మైనార్టీలకు పెద్దపీట వేశారని కొనియాడారు. మైనార్టీల సంక్షేమానికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత జగన్ దే అని పేర్కొన్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జగన్ ముస్లిముల కోసం తీసుకొచ్చారని పేర్కొన్నారు. మసీదులు, దర్గాలు ,ఆశురాఖనాలు శ్మశానాల నిర్వహణ కోసం ముస్లిములు భూములను ధానంగా ఇచ్చారని తెలిపారు. ముస్లిములు ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలకు తగిన సమయంలో తగిన గుణపాఠం నేర్పుతాయని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డాక్టర్లు

బెలూన్ పంప్ పద్ధతిన ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని కిమ్స్ వైద్యశాలలో 43 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తికి గంటసేపు సిపిఆర్ చేసి, కరెంట్ షాక్ ఇచ్చి అత్యంత కష్టమైన పరిస్థితుల్లో బెలూన్ పంప్ పద్ధతిలో స్టంట్ వేసే ఆపరేషన్ విజయవంతమైందని కార్డియాలజి విభాగం హెచ్‌ఓడి డాక్టరు సిఎస్ శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం కిమ్స్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ ఆపరేషన్‌కు సంబం ధించిన వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన గుండె నొప్పితో వైద్యచికిత్సల నిమిత్తం కిమ్స్ వైద్యశాల ఎమర్జెన్సీ విభాగానికి బాధితుడి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారన్నారు. పరీక్షలు నిర్వహించిన సీనియర్ కార్డియాలజిస్టు డాక్టరు నాగరాజారావు ఈసీజీ పరీక్షలు చేసి గుండె నిమిషానికి 350 నుంచి 400 సార్లు వేగంగా కొట్టుకుంటుందని గుర్తించారన్నారు. అదే సమయంలో ఆ వ్యక్తి స్పృహ కోల్పోవడం సంభవించిందన్నారు. వెంటనే స్పందించిన అత్యవసర విభాగం వైద్య సిబ్బంది 30 నిమిషాలకు పైగా సిపిఆర్ చేయడం, ఆరు సార్లు కరెంట్ షాక్‌లు (డిఫిబ్రిలేషన్) చేయగా బిపి పల్స్ నిలకడగా ఉండటంతో వెంటిలేటర్ అమర్చా మన్నారు. ఆ సమయంలో గుండె పంపింగ్ కేవలం 23 శాతం మాత్రమే జరగుతుండటాన్ని వైద్యులు గుర్తిచారన్నారు. ఇది ప్రమాదకరమని వెంటనే గుండెకు స్టంట్ వేయాలని వైద్యులు నిర్ధారించి ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమస్యను వివరించి స్టంట్ వేశామన్నారు. అయినప్పటికీ గుండె వేగం నిమిషానికి 350 నుంచి 400 సార్లు కొట్టుకుండటాన్ని గుర్తించామన్నారు. విధిలేని పరిస్థితిలో తిరిగి మరలా 10 సార్లు కరెంట్ షాక్ ఇచ్చి మరో 45 నిమిషాలపాటు సిపిఆర్ చేసి,మెడ భాగంలోని నరానికి సూది మందు ఇవ్వడం ద్వారా గుండె వేగాన్ని నియంత్రిచామన్నారు. అనంతరం మరో నాలుగు రోజుల పాటు వెంటిలేటర్ పైన వైద్యచికిత్సలు అందజేసి సంపూర్ణ ఆరోగ్యంతో వైద్యశాల నుంచి డిశ్చార్జ్ చేశామన్నారు.

ఈ ప్రోసీజర్‌లో పాల్గొని వైద్యసేవలందించి ప్రాణాలను కాపాడిన ఎమర్జెన్సీ డిపార్టుమెంట్ హెచ్‌ఓడి డాక్టరు సి.శ్రీనివాసులురెడ్డి, సీనియర్ గుండె వైద్యనిపుణులు డాక్టరు హెచ్ నాగరాజారావు, కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడి డాక్టరు సిఎస్ శ్రీనివాసరాజు, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టరు డి.సాహెబ్‌పీర్, చీఫ్ ఇంటెన్సివిస్ట్ డాక్టరు వి.జగదీష్, డాక్టరు కె.అశోక్, సీనియర్ క్యాత్‌ల్యాబ్ టెక్నీషియన్స్ ఎ.పెంచల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సిబ్బందిని వైద్యశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టరు ఎస్.సతీష్‌కుమార్‌లు అభినందించారు.

శ్మశానానికి దారి కల్పించండి సారూ..



ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని నారాయణమ్మపేట ఎస్‌సి కాలనీలోని దళితులకు సంబంధించిన శ్మశాన వాటికకు దారి కల్పించాలని కోరుతూ ఇటీవల తహశీల్దారు కార్యాలయానికి దళితులు దరఖాస్తులు పెట్టుకోవడంతో తహశీల్దార్ కృష్ణారెడ్డి దళితులకు చెందిన శ్మశాన వాటికకు దారిని కల్పించే ప్రక్రియలో భాగంగా నారాయణమ్మ పేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణమ్మ పేట గ్రామంలో త్వరలో గ్రామసభలు నిర్వహించి గ్రామస్తుల నుండి సూచనలు సలహాలు మేరకు శ్మశాన వాటిక కోసం దారి కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు కలివేల ఎలీషా కుమార్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు బొగ్గవరపు రత్నం, సర్వేయర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గృహ నిర్మాణాల సమీక్ష సమావేశం అనంతరం నెల్లూరులోని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి విచ్చేసిన రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని ఆత్మకూరు పట్టణ టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్ రెడ్డి, యువ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. వారి వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైదులు శ్రీరామ నవమి సందర్భంగా ఎలాంటి ఈవెంట్స్ అనుమతి లేకుండా నిర్వహించరాదని పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్, ఆత్మకు డివిజన్ కె.వేణుగోపాల్, సంగం సిఐ వేమారెడ్డి ఆదేశాల మేరకు శ్రీరామ నవమి పండుగ సందర్భంగా పలు సూచనలు చేశారు. 6వ తేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా, అప్పటి నుండి పలు గ్రామాలలో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అనుమతి లేకుండా ఈవెంట్స్ గానీ, అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు, డైమండ్ డబ్బా, పలు కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. అశ్లీల నృత్యాలు ఎవరైనా నిర్వహిస్తే, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పవిత్రమైన శ్రీరామ నవమి పండుగను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, జరుపుకోవాలని ,అందరికీ ముందుగా శ్రీరామనవమి శుభాకాంక్షలు ఈ సందర్భంగా తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని స్థానిక ట్రంకు రోడ్డులోని "తిరుమల జనరల్ స్టోర్స్" వద్ద ఉచిత మజ్జిగ, చల్లని మంచి నీటి చలివేంద్రాన్ని కావలి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు సి.హెచ్.నాగరాజు", మండల వ్యవసాయ అధికారి లలిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో ప్రజల దాహార్తి తీర్చేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా నిత్యం అందుబాటులో ఉండే ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు ఏడుకొండల రావు, ఉపాధ్యక్షులు నేరెళ్ళ జ్వాలా సుబ్బారావు, సభ్యులు పేరూరు శివప్రసాద్, బీసు నాగమోహన్ రావు, వెల్లంపల్లి మోహన్‌రావు, సురె కృష్ణారెడ్డి, బచ్చు తేజ, రవి, వెంకట సురేష్, దేవరపల్లి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు లెక్కలు చేపట్టాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం డెల్టా ఆయకట్టుకు సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారు పర్యవేక్షణలో చేపడుతున్న ఆయకట్టు లెక్కలను పారదర్శకంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి ఈ మేరకు శుక్రవారం తహశీల్దార నిర్మలానంద బాబాతో ప్రత్యేకంగా చర్చించారు. త్వరలో ఐఎబి సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఈ ఆయకట్టు లెక్కల ప్రకారమే నీటి విడుదల ఉంటుందని, దానిని దృష్టిలో పెట్టుకుని ఈ ఆయకట్టు లెక్కలను పారదర్శకంగా చేపట్టేలా తగు చొరవ తీసుకోవాలని ఆయన తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆయకట్టు లెక్కలను త్వరితగతిన పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసులు ఉన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలో నూతనంగా మరో నాలుగు బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణం కోసం శుక్రవారం స్థలాల పరిశీలన చేపట్టినట్లు జయపురం గుండుపల్లి దేవమ్మ చెరువు చింతూరు గ్రామాలలో రెవెన్యూ అధికారులు స్థలాలు పర్యటించి అనుకూల ప్రాంతాలను గుర్తించి పరిశీలించారు. ఈ నాలుగు టవర్లు అందుబాటులోకి వస్తే ప్రజలు బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సంబంధమైన సమస్యలు లేకుండా ఉంటాయని కొందరు ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, విఆర్ఓ బాలు, విఎస్ ప్రశాంత్ పాల్గొన్నారు.

కన్యాకుమారికి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-కోవూరు : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థి జె.ధర్మరాజు భీమవరం నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం కోవూరుకు చేరుకున్న ధర్మరాజుకు సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్ రెడ్డి ఆతిథ్యం ఇచ్చి పలు విషయాలను చర్చించారు. యువత పట్టుదల పడితే సాధించలేనిది ఏదీ ఉండదని ఆ ఉద్దేశంతో కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి తమకు ఎంతో విలువైన సూచనలు సలహాలు ఇచ్చారన్నారు. అనంతరం ధర్మరాజు సైకిల్ యాత్ర నెల్లూరు వైపునకు బయలుదేరింది.

ఎంఇఓగా అనంతలక్ష్మి బాధ్యతలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారిణి-1 (ఎఫ్.ఎసి.)గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. అనంతలక్ష్మి నేడు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంఇఓ-2గా వున్న చలపతి,కార్యాలయ సిబ్బంది అనంతలక్ష్మికి సాదర స్వాగతం పలికారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయానికి, ఆత్మకూరు డివిజన్ ఉపవిద్యాధికారి కార్యాలయానికి, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, నెల్లూరుకు ఈ విషయం తెలియజేశారు.

మారెళ్ల మల్లికార్జున నియామకం

ప్రజాశక్తి-దుత్తలూరు : ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన మారెళ్ళ మల్లికార్జున నియమించారు. అనంతరం ఆయన మారెళ్ళ మల్లికార్జున మాట్లాడుతూ సంస్థ ఎదుగుదలకు ఎంతో కష్టపడి కృషి చేస్తానని తనమీద నమ్మకంతో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించిన ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కూడారి. తిరుపాలుకు, కార్యదర్శి ఉదయ్ కుమార్ కి, సౌత్ జోన్ అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు వస్తానని, సంస్థ సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే వినియోగదారులు ఎక్కడ ఏ వస్తువు కొన్న తప్పనిసరిగా బిల్లు తీసుకొని న్యాయం కోసం పోరాటం చేయవచ్చని వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సంగం : స్థానిక సాయినగర్‌లో టిడిపి నాయకులు శుక్రవారం పూజలు నిర్వహించి అనంతరం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో ప్రతీ వీధిలో సిమెంట్ రోడ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా ఉండటమే లక్ష్యంగా మంత్రి ఆనం ఆదేశాలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, కాకు మధుసూదన్ యాదవ్,కాకు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు చౌదరి, శ్రీనివాసులు నాయుడు, పృథ్వీ యాదవ్ తదితరులున్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామ దేవస్థానం దేవుని ఊరేగింపు సందర్భంగా శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్ రోడ్డు సమీపాన మధ్యాహ్నం రోడ్లు అడ్డంగా ఉన్న చెట్లను ఆలయ కమిటీ సభ్యులు కొట్టడంతో కొమ్మ విద్యుత్ స్తంభంపై పడటంతో విద్యుత్ స్తంభం ఒక్కసారిగా పక్కకు వంగడంతో రోడ్డుపై జనాలు లేకపోవడంతో పెను ప్రమాణమే తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారి జడరాయ విద్యుత్ నిలిపివేసి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ మరమ్మత్తులు చేసి ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఎఇ జడరాయ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా చెట్లను తొలగించడంతో సమస్య తలెత్తిందని, రోడ్ల పక్కనున్న చెట్లను తొలగించే ముందు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి పనులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-విడవలూరు

కోవూరు నియోజకవర్గం పరిధిలో ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి శుక్రవారం మంత్రి కొలుసు పార్థసారథిని కోరారు. ఆయన సమక్షంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆమె కోవూరు నియోజకవర్గ పరిధిలోని గృహ నిర్మాణ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకున్న 869 మంది లబ్ధిదారులకు చెల్లించాల్సిన రూ.2 కోట్ల 84 లక్షల 90 వేల బకాయిలు త్వరగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కోవూరు నియోజకవర్గంలో 2,502 ఇళ్ళు నిర్మించేందుకు అగ్రిమెంట్ చేసుకున్న 30మంది కాంట్రాక్టర్లు ఐదేళ్లలో కేవలం 640 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారన్నారు. సకాలంలో పనులు చేయని పాత



మంత్రికి సమస్యలను తెలియజేస్తున్న కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కాంట్రాక్టర్లను తొలగించి కొత్త కాంట్రాక్టర్ల ద్వారా మిగిలిన 1,862 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందివ్వాలన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 2.0 పథకంలో భాగంగా 8,900 మంది దరఖాస్తు చేసుకొని ఉన్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలతో పాటు బిసిలు అధిక సంఖ్యలో వున్న కోవూరు నియోజకవర్గానికి అదనంగా మరో 10వేల ఇళ్ళను మంజూరు చేయాలని ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మంత్రి పార్థసారథిని కోరారు. డెల్టా ఏరియా కావడంతో చాలాచోట్ల ప్రభుత్వ స్థలాల కొరత వుందని అటువంటి ప్రాంతాలలో ప్రయివేట్ భూమి కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆమె మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కాలనీలలో రోడ్లు, విద్యుత్ మరియు తాగునీటి సదుపాయాలు కల్పించాలన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచనతో స్పందించిన మంత్రి ప్రభుత్వ గృహ సముదాయాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఒ.ఆనంద్, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో పాటు జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

మురుగునీటితో ఇక్కట్లు..

- రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



సమస్యను వెల్లబుచ్చుతున్న మహిళలు

మురుగునీరు పోయినందుకు వెసులుబాటు కల్పించి సైడ్ కాలువలు వేయాలని మైపాడులోని బిసి కాలనీ మహిళలు నిరసన చేపట్టారు. శుక్రవారం అధికసంఖ్యలో ముస్లిం మైనారిటీ మహిళలు మీడియా సమావేశం నిర్వహించి ఆందోళన వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మైపాడు బిసి కాలనీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా సైడ్ కాలవలు మంజూరైనప్పటికీ వాటిని పూర్తి చేయకుండా రోడ్డు వేయడంతో మురికి నీరు పోయే వీల్లేక కాలనీలో చేరి దుర్గంధం వ్యాపించిందని, దానివల్ల ఆరోగ్యాలు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి మురుగునీరుతో తాము ఇబ్బందులు పడుతున్నామని మురుగునీరు పోయేందుకు దారి చూపకుండా కాంట్రాక్టర్ అత్యాశతో రోడ్డు పనులు మాత్రమే చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం దానికి కారణం అని వారు పేర్కొన్నారు. ప్రధానంగా సైడ్ కాలవల నిర్మాణం పూర్తి చేసి ఆ తర్వాతరోడ్డు నిర్మాణాలు చేపట్టాలని వారు కోరారు. కాలువల నిర్మాణం పూర్తి చేసి మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులను, సంబంధిత శాఖ అధికారులకు వారు కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ షకీలా

'బిఎస్ఆర్'లో చిన్నపిల్లల వైద్య విభాగం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరులో ప్రముఖ వైద్యశాలైన బొమ్మిరెడ్డి సుందర్ రామిరెడ్డి హాస్పిటల్‌లో చిన్నపిల్లల వైద్య విభాగాన్ని బిఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షకీలా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ షకీలా విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాదులోని ప్రముఖ వైద్యశాలలు ఫెర్నాండెస్, విజయ మేరీ హాస్పిటల్స్‌లో పురిటి పిల్లలు, చిన్నపిల్లల వైద్యంలో 12 సంవత్సరాల అనుభవం ఉన్న డాక్టర్ సిరాజ్ ఖానం నేటి నుండి ఆత్మకూరు పట్టణంలోని బిఎస్ఆర్ హాస్పిటల్‌లో చిన్నపిల్లల వైద్యరాలుగా తమ సేవలను ప్రారంభించనున్నారని వీరు 24 గంటలు ప్రతిరోజు అందుబాటులో ఉంటారని డాక్టర్ షకీలా తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ షకీలాతో పాటు, చిన్నపిల్లల వైద్యరాలు సిరాజ్ ఖానం, బొమ్మిరెడ్డి తారకనాథ్ రెడ్డి, బిఎస్ఆర్ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ ముజాకిర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ సిరాజ్ ఖానం మాట్లాడుతూ తనకు పురిటి బిడ్డలు, చిన్నపిల్లల వైద్య సేవలలో 12 సంవత్సరాల అనుభవం ఉందని అదే అనుభవంతో నేటి నుండి డాక్టర్ బిఎస్ఆర్ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందించేందుకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్న బిఎస్ఆర్ హాస్పిటల్‌లో తాను పనిచేసే అవకాశాలు లభించడం తనకు సంతోషంగా ఉందని డాక్టర్ తెలిపారు.

రహదారిపై మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం తిప్ప జాతీయ రహదారిపై శుక్రవారం రహదారి డివైడర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో స్థలానికి బిట్రగుంట ఎస్ఐ బోజ్య నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా హాస్పటల్ తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు సుమారు 25 నుండి 30యేల్ల వయస్సు కలిగి ఉండవచ్చని నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు.

ముస్లిముల నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీ సుల్తాన్ షాహిద్ దర్గాలో ఉన్న శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లిములు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి పి.యస్థాని మాట్లాడుతూ 2024 జూలైలో మూడు రోజుల పాటు జెసిబితో పెకలించిన కంపచెట్లు చెత్త అక్కడే ఉందని, వెంటనే శ్మశానవాటిక నుండి వాటిని తొలగించాలన్నారు. శ్మశానవాటికలో అంతర్గత రోడ్డు నిర్మాణం చేపట్టాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్ల స్థానంలో కొత్త మరుగుదొడ్లు నిర్మించాలని, దర్గా చుట్టుపక్కల దర్గాలోపల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గత 12యేళ్ల నుండి వక్ఫ్‌బోర్డు రూంల నుండి, హుండి ద్వారా వస్తున్న



నిరసన చేపడుతున్న ముస్లిములు

ఆదాయం వివరాలను తెలియజేయాలని, షాది మంజిల్ నిర్మించాలన్నారు. దర్గాలో ముజావర్, స్వీపర్ల జీతాలు పెంచాలని, స్వీపర్లకు 8గంటల విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ మండల కమిటీ సభ్యులు షేక్ సంధాని, ముస్లిం నాయకులు పి.మస్తాన్, షేక్.ఖలీల్, షేక్ ఖాజారంతుల్లా, షేక్ మస్తాన్, షేక్ సుల్తాన్, షేక్ రిజ్వాన్, షేక్ సుల్తాన్ బాష, సయ్యద్ చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూములు సర్వేకు సంబంధించిన గ్రామసభలో రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మొదట గ్రామంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో పొలాల సర్వేకు సంబంధించి ఏ సమస్య ఉన్న తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యం

ప్రజాశక్తి-కావలి

గృహ నిర్మాణ కార్యక్రమంలో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను అధిగమించి అర్హత గల ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం జెడ్‌పి హాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, సర్వేపల్లి, కావలి, కోవూరు, ఉదయగిరి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్, నుడా చైర్మన్ శ్రీనివాసు లరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్ డి రాజబాబు, జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్‌లతో కలసి జిల్లాలోని గృహ నిర్మాణాల పురోగతి గురించి సమీక్షించారు. కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు గ్రామాలు నుడా పరిధిలోకి రానందున దాదాపు 200మంది లబ్ధిదారులు నష్టపోతున్నారని, జిల్లా



మాట్లాడుతున్న కావలి ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

మొత్తంలో కేవలం ఈ ఐదు గ్రామాలు పట్టణీకరణలో భాగం కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పూర్తయిన ఇంటి లబ్ధిదారుల్లో ఎస్‌సి ఎస్‌టి బిసిలకు నూతనంగా పెంచిన మొత్తాలను వర్తింప చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పిడి వేణు గోపాల్, జెడ్‌పి సిఇఒ విద్యారమ, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇలు అశోక్, విజయన్, వెంకటరమణ, డిఆర్‌డిఎ పిడి నాగరాజకుమారి, ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలు పాల్గొన్నారు.



చిల్లచెట్లు వేలం

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని తిమ్మసముద్రం చెరువు కట్ట పైనున్న చిల్ల చెట్లకు (కర్ర తుమ్మ) శుక్రవారం వేలంపాట నిర్వహించారు. నీటి సంఘం అధ్యక్షులు తలపనేని మధుసూదనరావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఏఈ మల్యాద్రి వేలంపాటను నిర్వహించారు. తిమ్మసముద్రం కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ వేలంలో ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. పాటదారులు ఒక్కొక్కరు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. తొమ్మిదో మేలుకు చెందిన గంగ పట్ల మాలకొండయ్య రూ.55వేలకు పాట దక్కించుకున్నారు. బహిరంగంగా జరిగిన ఈ వేలంలో స్థానిక టిడిపి నాయకులు కంచర్ల వినోద్ కుమార్, యూనిట్ ఇన్‌ఛార్జ్ స్వర్ణ కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలోకి ఆలయాలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో ప్రసిద్ధి చెందిన మూడు ముఖ్య ఆలయాలను ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ శుక్రవారం తమ అధీనంలోకి తీసుకుంది. కావలి పట్టణ పాతవూరులోని రుద్రపాద మల్లేశ్వర స్వామి దేవాలయం (శివాలయం), బంగారపు దుకాణాల సమీపంలో వున్న లక్ష్మీకాంత స్వామి ఆలయం (విష్ణాలయం), కావలి గ్రామ దేవతగా చెప్పుకునే కలుగోల శాంభవి అమ్మవారి ఆలయాలను నేటి నుంచి దేవాదాయ శాఖ తన ఆధీనంలోకి తీసుకుంది. ఇఒగా అరవ రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్నో రోజుల కావలి పట్టణ ప్రజల కల నేడు కావలి ఎంఎల్ఎ వెంకట కష్ణారెడ్డి చొరవతో నెరవేరింది అంటూ పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కావలి పట్టణ పోలీసు అధికారులు తగు చర్యలు చేపట్టారు.

బాలికలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రవాస భారతీయులైన మింది శ్రీనివాస్, రమా దేవిల కుమార్తె జ్యోతిర్మయి మింది, పుట్టిన రోజు సందర్భంగా సింగిల్ పేరెంట్ వున్న పిల్లలకు నూతన వస్త్రాలు, శ్రీనివాస్ సౌజన్యంతో ముందుకు సాగుతున్న శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను డిస్ట్రిబ్యూషన్ నిర్వహించారు. జ్యోతిర్మయి జన్మదిన కానుకగా పట్టణంలో వివిధ ప్రాంతాలలో ఉన్న తల్లి లేక తండ్రి లేని బాలికలను 20మందిని ఎంపిక చేసి వారికి నూతన వస్త్రాలు పివిపి అంజనీ కుమారి, సిటీ స్మాల్ కాజస్ కోర్టు, తెలంగాణా హైదరాబాద్, బ్యాంకు ఆఫ్ ఇండియా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజ్ సింగ్, నెల్లూరు జిల్లా వాస్తవ్యులు ఆదెమ్మసత్రం, ఇందుకూరుపేట మండలం జెడ్.పి.హెచ్. స్కూల్ హిందీ పండిట్ శారదల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రవాస భారతీయులైన మింది శ్రీనివాస్ సహకారం తో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌లు



పంపిణీ చేశారు. కావలి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ మాధవి చేస్తున్న మహిళా ఉపాధి కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ తమ వద్ద శిక్షణ పొందిన మహిళల చేతనే బాలికలకు దుస్తులు కుట్టించి ఇవ్వాలనే మింది శ్రీనివాస్ కోరిక మేరకు కుట్టించి ఇచ్చినట్లు తెలిపారు. జ్యోతిర్మయి జన్మదిన వేడుక సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు, మహిళలకు విందు ఏర్పాటు చేశారు. తమకు ఈ అవకాశం కల్పించడంపై మింది శ్రీనివాస్ కుటుంబంకుశ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి ఆధ్వర్యంలో ట్రస్ట్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

జెవివి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించు షుగర్, బిపి, గుండె సంబంధిత వేదన వైద్య శిబిరం 6వ తేదీన ఆదివారం శ్రీ షిరిడి సాయిరాం కళాశాలలో ఉదయం 7 గంటల నుండి11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల నుండి ప్రముఖ వైద్యులు ఎం.వి.రమణయ్య, నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ నుండి ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టం ఎం.బాలకృష్ణ విచ్చేస్తారన్నారు. కాబట్టి సభ్యులందరూ వారి పరిసర ప్రాంతాల్లోని బిపి, షుగర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడు వారికి తెలియజేయాలని కోరుతున్నామన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే పేషెంట్లు పాత మందుల చీటీని (పుస్తకం) తీసుకొని రావలసిందిగా కోరారు. షుగర్ పరీక్షకు ఒకసారి చేయించుకున్న వారికి రూ.25, ఆహారం తిన్న తర్వాత రెండో సారి కూడా చేయించుకునే వారు మరో రూ.25 చెల్లించాలన్నారు. ఇన్సూలిన్ ఒకటి రూ.80, రెండు నెలలకు (షుగర్, బిపిలకు) అవసరమయ్యే మందులు కేవలం రూ.200 అని తెలియజేశారు.

జగనన్న కాలనీల్లో చినుకు పడితే చిత్తడే..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



బుచ్చి పట్టణంలో స్థానిక పెద్దూరు మంగలి కట్ట జగనన్న కాలనీల్లో చిన్నపాటి చిరుజల్లులకే రోడ్లు చినుకు పడితే చిత్తడే అన్న సందంగా మారాయి. పాలకుల నిర్లక్ష్యమో అధికారులు ఆలశత్వమో తెలియదు కానీ చినుకు పడితే పెద్దూరు జగనన్న కాలనీల్లో మట్టిరొడ్డంతా చిత్తడి చిత్తడిగా అవుతుంది. కొద్దిపాటి వర్షం పడితే ఇక ఈ రోడ్డుపై వెళ్లాలంటే ఇంకా పట్టపగలే చుక్కలు చూడవల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కురిసిన మోస్తారు వర్షానికి జగనన్న కాలనీలో అధ్వానంగా మారిన రోడ్లు చిన్నపిల్లల నుండి పండు ముసలి వరకు ఆ రహదారి గుండా వెళ్లాలంటే ఎక్కడ కాలుజారి పడతారేమోనని భయపడుతున్న పరిస్థితి నెలకొంది. అడుగు అడుగున గుంతలు ఇలాంటి ఎన్నో కష్టాల కదలిలో ఆ కాలనీ ప్రజానీకం నిత్యం దుర్భరమైన జీవనాన్ని కొనసాగించే వలసిన పరిస్థితులు దాపరించాయి. ఇప్పటికైనా జగనన్న కాలనీల్లో సమస్యలపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టాలని జగనన్న కాలనీవాసులు కోరుతున్నారు.

సింగంపేటలో ర్యాలీ



ప్రజాశక్తి-అల్లూరు

మండల పరిధిలో సింగపేట గ్రామంలో త్వరలో ప్రారంభం కానున్న రీసర్వేకు సంబంధించి గ్రామంలోని అంకాలమ్మా గుడి దగ్గర నుంచి గ్రామ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామంలో రీసర్వే సమస్యలపై గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వారు ప్రతిఒక్కరూ రైతులు అధిక సంఖ్యలో పాల్గొని దానిని సద్వినియోగపరచుకున్నారు. వారి సమస్యలు తొందర్లో పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో బండి అమర్‌రెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు క్రింద మొట్ట మొదటిగా సింగపేట గ్రామాన్ని ఎంచుకున్నందుకు తహశీల్దార్‌కు కతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలు అధిక సంఖ్యలో ఉన్నాయని గత ప్రభుత్వంలో ఏమీ చేయలేకపోయామని తరతరాలుగా ఉన్న భూములను వేరొక పేర్లు ఎక్కించారని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగితిరిగి కాళ్ళు అరిగిపోయాయని తెలిపారు. ఇప్పుడైనా అటువంటి పొరపాట్లు లేకుండా గ్రామంలో ఉండేవారు.. లేనివారిని.. గ్రామంలో విచారించి.. కౌలుదారులు ఎవరు పూర్తిగా ఎంక్వయిరీ చేసి సర్వే చేయాలని కోరారు.